# సదభిప్రాయము

సావిత్రి అదిరిపోయింది ఆమె చెప్పిన మాటలకు.

ఆమె అంటే అరుంధతి, సావిత్రి భర్త పనిచేసే ఆఫీసులో పనిచేస్తుంది. ఈ మధ్యనే పార్కులో పరిచయం అయ్యింది.

ఓ సాయంత్రం పిల్లలను తీసుకుని పార్కుకు షికారుకు వెళితే అక్కడ అరుంధతి ఏదో నవల చదువుకుంటూ కనిపించింది. ఆ నవల మీద ఉన్న రబ్బరు స్టాంపు బట్టి.... అది తన భర్త తీసుకువచ్చే క్లబ్‌దే అని గ్రహించి, కుతూహలం ఆపుకోలేక అడిగేసింది, ఆ నవల తనకు ఎక్కడ నుండి వచ్చిందని.

ఆ రకంగా పరిచయం ఏర్పడి స్నేహంగా మారింది.

సావిత్రి ప్రత్యేకత ఎవరితోనూ పర్సనల్ విషయాలు మాట్లాడదు. సినిమా కబుర్లు.... రాజకీయాలు.... కొండకచో సాహిత్య హత్యల గురించి విసుర్లు....

ఏదో మాటల సందర్భంలో ... తన భర్త చాలా కష్టపడతాడని .... అందరూ ఆఫీసులో అతనికి పని అప్పజెప్పి తిరుగుతారని .... ఆ పని పూర్తి చేసే సరికి రాత్రి అవుతుందని వాపోయింది సావిత్రి అమాయకంగా.

సావితి అమాయకత్వాన్ని అరుంధతి క్షమించి నవ్వేసి ఊర్కొని ఉండవచ్చు కాని, అలా జరగలేదు.

పకపక నవ్వేసింది అరుంధతి. సావిత్రి బిత్తరపోయింది.

“ అయితే మీ వారు మీకు చెవులో పువ్వులు బాగా పెడతారన్నమాట!”

“ అంటే...” సావిత్రి అర్థంకాక అడిగింది.

“ తను ఆఫీసు నుండి ఆలస్యంగా రావడానికి కారణం అందరి పని తాను చేస్తున్నట్లు చెబుతున్నారా?” అరుంధతి రెట్టించింది.

“ ఊ ! ఒక పట్టాన వద్దని చెప్పలేరు ఆయన... బొత్తిగా మొహమాటస్తులు” సావిత్రి బాధపడింది.

" కాని అందరూ ఆయన గురించి ఇంకోలా అనుకుంటారు".

" ఏమని ?" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రి.

" అందర్కీ తన పని అంటగడతాడని" అరుంధతి నవ్వు ఆపుకుంది.

సావిత్రి కొన్ని క్షణాలు బిత్తరపోయినా వెంటనే ఖండించింది.

" అలా అయితే .... ఆయన ఎందుకు ఆలస్యంగా వస్తారు? ఐదు కాగానే ఇంటికి వచ్చేస్తారు గదా! అందరూ ఆయన పని చేస్తూ ఉంటే ఇంకా ఐదు తరువాత ఆయనకు పని ఏమి ఉంటుంది?"

" అది ఆయననే అడిగి కనుక్కోండి" అరుంధతి నవ్వేసి వెళ్లిపోయింది – సావిత్రి ఆమె నడుగలేదు.

ఆ రాత్రి సావిత్రి తట్టుకోలేక తన భర్త నందకిషోర్ చెవి కొరికింది. అరుంధతి మాటలు విన్న కిషోర్ నిశ్చేష్టుడయ్యాడు.

" అది అలా చెప్పిందా? దాని పని కూడా నేను చేస్తూ ఉంటానే!"

" ఆమెది సరే ... అందరికీ మీ పని పంచిపెడతారట కదా!"

" నమ్ముతున్నావా! అది ఏదో కూసింది ... ఊరికే కూర్చోబెట్టి నాకు జీతం ఇస్తున్నారా?" కోపంగా అడిగాడు.

" మరి రోజూ ఆలస్యంగా ఎందుకొస్తున్నారు?"

" పని ఉంది కనుక "

" మరి అరుంధతికి ఉండదా... ఆమె కూడా మీ ఆఫీసే కదా!"

" మా ఆఫీసే కాని మా సెక్షన్ కాదు. సెక్షన్‌లో పని ఎక్కువ – స్టాఫ్ తక్కువ" చెప్పాడు. " ఆమె సెక్షన్‌లో పని తక్కువ. స్టాఫ్ ఎక్కువ."

" మరి ఆ సెక్షన్‌కు వెళ్లకపోయారా !" సావిత్రి లాజిక్కు.

" అది నీకర్థం కాదులే.... అడగంగానే సీటు మార్చరు. ఎవరూ వాళ్ళ సీటు వదిలి మార్పుకు సిద్ధపడరు. అందులో పనిలేని సీట్లో ఉండేవాళ్ళు అస్సలు ముందుకు

రారు. నా సీటంటే అసలు ఎవరూ తీసుకోరు.... గొడ్డు చాకిరీ!" చెప్పాడు నందకిషోర్.

సావిత్రి మనస్సు కాస్తంత తేలిక పడింది. అరుంధతి చెప్పినట్లు తన భర్త సోమరి కాదు..... మంచి పనోడు!

మళ్ళీ ఒకరోజు అరుంధతి సావిత్రి వాళ్ళాయన ప్రసక్తి తెచ్చింది.

" అబ్బ ! ఇవ్వాళ మీ ఆయన ఆఫీసులో భలే తిరిగాడులే.... మేనేజరు ఎన్నో చివాట్లు పెట్టాడు. కళ్ళెంబడి నీళ్ళొకటే తక్కువ" చెప్పింది సావిత్రికి.

సావిత్రికి రోషం ముంచుకొచ్చింది.

" ఎందుకట !"

" ఏమో ! పనిలో ఏదో తప్పు చేసినట్లున్నాడు.... ఆయన ఈయన మీద కేకలేయడం మటుకు అందరూ విన్నారు" చెప్పింది.

మొహం వాడిపోయి వచ్చిన కిషోర్‌ను నిలేసింది, ఏమి జరిగిందని? అతను చెడామడా ఆ మెనేజర్‌ను తిట్టాడు.

" పనికిరాని వాడు.... అనుమానపు పిశాచం.... నేను చెయ్యలేదంటే విన్నాడు కాదు. ఎప్పుడు చస్తాడో".

" ఇంతకీ ఏం జరిగింది !" శాంతంగా అడిగింది.

" వాడున్నాడు గదా యూజ్‌లెస్ ఫెలో .... వాడికన్నీ అనుమానాలే.... ఎవడో ఏదో చేసిందానికి .... ఆ కాగితాలు నేనే మాయం చేసేశానని వాడి నమ్మకం.... వెధవ ... బాగా తిట్టాలి బుద్ధొచ్చేట్టు.... "

భర్త రిలాక్స్ అయ్యాక లాలించి అసలు విషయాన్ని రాబట్టింది.

ఆఫీసులో ఓ ఫైల్ మిస్సయింది. మేనేజర్ నందకిషోర్‌ను ఆ ఫైల్ తీసుకురమ్మన్నాడు. కిషోర్ దానికోసం తెగ వెదికాడు.... దొరకలేదు. ఈ లోగా మేనేజర్ నుంచి ఒకటే తొందర! హడావిడి !!

దొరకలేదని చెప్పాడు.

" యు ఆర్ రెక్లెస్ ..... కేర్‌లెస్ ... అన్‌ఫిట్ ఫర్ ది జాబ్! నిన్ను నమ్మి ఇంపార్టెంట్ సీట్ అప్పచెప్పితే అంత అశ్రద్ధ అయితే ఎలాగూ!"

మేనేజర్ చెడామడా అన్నాడు.

" కాదు సార్... బీరువాలో పెట్టి లాక్ చేసినట్లు గుర్తు" - అతని తిట్లకు ఒళ్ళంతా చెమటలు పట్టి కంగారుపడిపోయాడు. మాట తడబడింది.

" బీరువాలో ఉన్న ఫైల్ ఎలా మాయమౌతుంది! దానికి రెక్కలు వచ్చాయా? ఆ బీరువా తాళం చెవులు నీ దగ్గరే ఉంటాయి కదా!"

" ఉంటాయి సార్.... కాని, మిగతా రికార్డ్‌ల కోసం కూడా చాలామంది ఆ బీరువాలో వెదుకుతూ ఉంటారు. మన ప్యూన్‌లు మాటిమాటికీ దాన్ని కిందా మీదా చేస్తుంటారు."

" యు ఆర్ యూజ్‌లెస్ ! ఆ ఫైల్ సాయంత్రంలోగా నాకు అందివ్వకపోతే నేను నీపైన పైవాళ్ళకు కంప్లైంట్ చేస్తాను" చెప్పాడు.

దాంతో నందకిషోర్‌కు మరింత గాబరా అయింది. నీరసంగా వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. దాన్ని ఎవరు తీసుకుపోయే అవకాశం ఉందని ఆలోచిస్తూ ఆఫీసులో అందరినీ అడిగాడు. అందరూ తమకు తెలియదని చెప్పారు.

' లావొక్కింతయు లేదు' అనుకుంటూ మనసు పూర్తిగా సాయినాథుడికి దండం పెట్టుకున్నాడు సాయంత్రం అవుతూ ఉంటే.

ఆ టైమ్‌లో టెంపరరీ కుర్రోడు అటువైపు ఎందుకో వచ్చాడు. అతనిపేరు నరసింహం. అయితే అందరూ 'సింహం' అని పిలుస్తారు.

" సింహం ఓ కాఫీ చెప్పు...." అని చెప్పి ఊరికే క్యాజువల్‌గా ఫలానా ఫైల్ నువ్వేమన్నా తీశావా అని అడిగాడు. సింహం వెంటనే జవాబిచ్చాడు.

" అదేంటిసార్ .... వారం కిందట ఆ ఫైల్ మేనేజర్ అడిగితే నేనే తీసుకుపోయి ఇచ్చాగదా. మీ చేత్తోనే ఇచ్చారు" సింహం ఫెడేల్‌మని జవాబిచ్చాడు.

నందకిషోర్‌కు మెరుపు మెరిసింది

వెంటనే మేనేజర్ ఛాంబర్‌లోకి పరుగెత్తుకుంటూ పోయాడు.

ఆ తేదీ, టైం మేనేజర్‌కు చెప్పాడు.

మేనేజర్ కొంచెం విస్తుపోయినా గాంభీర్యాన్ని విడువకుండా అన్నాడు.

“ ఉండొచ్చు, కాని వెంటనే పంపించి ఉంటాగా - అనవసరమైన ఫైళ్లు నా దగ్గర పెట్టుకోను”

“ కాని మీరు వాపస్ పంపినట్లు నాకు గుర్తు లేదు” - నసిగాడు.

“ యు ఆర్ ఇర్రెస్పాన్సిబుల్ ! ఒక వేళ నాకు పంపినా నువ్వు గుర్తుపెట్టుకోవాలి.... అది రాకపోతే వచ్చేదాకా ఫాలోఅప్ చేయాలి!” గర్జించాడు మేనేజరు.

“ ఒకసారి మీ ఫైల్స్ చూడండి సార్ !” అర్థించాడు.

“ అరే ! ఉంటే నా టేబుల్ పైనే ఉంటుంది. అంతేగా ... నేనేం పులుసు కాసుకొని తాగనుగా”, విసుగ్గా అన్నాడు - టేబుల్ మీదున్న ఫైళ్లను చేత్తో అటూ ఇటూ తడుముతూ....

నందకిషోర్ వెదికాడు దొరకలేదు.

“ మిష్టర్... కిషోర్ అయిదు అయింది. హెడ్ ఆఫీసుకు ఇన్‌ఫామ్ చేయమంటావా!” కోపంగా అడిగాడు.

నందకిషోర్ నాలుక తడారిపోయింది.

సింహం కాఫీ కప్పులతో లోపలికి వచ్చాడు.

“ ఫైల్ కనిపించిందా సార్!” అడిగాడు.

“ లేదు ...” బాధగా చెప్పాడు.

“ మీరు కాఫీ తీసుకోండి సార్... నేను చూస్తాగా...” - రెండు కప్పులు వాళ్ళకిచ్చి టేబుల్ సర్దడం మొదలెట్టాడు.

దొరకలేదు - సింహం కాసేపు ఆలోచించాడు.

“ సార్.... మీ బీరువా కీ యిస్తే కాస్త చూస్తా !” సింహం.

" వాట్ ..... దాంట్లో ఎందుకుంటుంది?"

" కలిసిపోయిందేమోనని, ఎవరన్న పొరపాట్న పెట్టి ఉంటారేమో!"

సింహం ఆ కీసు తీసుకొని అలమర ఓపెన్ చేసి వెదికాడు. ఒక్క నిమిషంలోనే అరిచాడు.

" సార్ .... దొరికింది... ఇక్కడుంది" ఆ ఫైలు తీసి బయటపడేశాడు.

మేనేజర్ మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

" ఏమయ్యా ! కిషోర్ నా బీరువాలో ఎప్పుడు పెట్టావు" – తడబడ్డాడు.

" నేను కాదు సార్ పెట్టింది. మీరే పెట్టి మర్చిపోయి వుంటారు" – కిషోర్.

" ఎవడో వెధవ వేరే ఫైలుతో పాటు పెట్టి ఉంటాడు" సర్దుకున్నాడు.

" సార్ ! ఇందుకా మీరు నన్ను నానా మాటలన్నారు.... నేనేం బాధపడటం లేదు.... కాని ఒక్కసారి చూసుకొని ఉంటే బాగుండేది. ఇంతమందికి ఇంత టైమువేస్టు అయ్యేది కాదు" – వాడిగా చూశాడు కిషోర్.

తల వంచుకున్నాడు మేనేజరు.

" మరి ఇందులో మీ తప్పేముంది ?" సావిత్రి అడిగింది.

" అంతా నాఖర్మ !" నందకిషోర్ బాధపడ్డాడు.

ఓ ఉదయం నందకిషోర్.... పేపరు చదువుకుంటూ ఉంటే సావిత్రికి ఆవేశం వచ్చింది. గయ్‌మని లేచింది అతనిపైన.

" ఇంటి విషయాలు పట్టించుకోరు.... పిల్లల సంగతి అసలు పట్టదు. అంతా నేనే చావాలి. మీ అంత అసమర్థుణ్ణి ఎవరినీ చూడలేదు.... అన్ని పనులు నేనే చూసుకోవాలి ! ఒక్క ఆఫీసుకు పోయొస్తే చాలా.... మిగతా పై పనులు ఎవరు చేసుకుంటారు? పిల్లాడికి ఆరోగ్యం బాగాలేదు. డాక్టర్‌కు చూపించాలని ఎన్నిసార్లు చెప్పాలి. వాగి వాగి నా నోరు నెప్పిపుడుతుందే గాని మీకు చీమకుట్టినట్లయినా ఉండదు" – అలా అరుస్తూ ఉండిపోయింది చాలాసేపు.

ఆ మూడ్ ఇంకెంతసేపు ఉండేదో.... అరుంధతి వచ్చింది, ఆ టైముకు, తలుపు తోసుకొని.

" ఇప్పుడేనా రావడం!" అనుమానంగా అడిగింది.

" ఊ... ! తలుపు తట్టినా మీరెవరూ వినిపించుకొనే మూడ్‌లో లేరు - అయాం సారీ.... డిస్టర్బ్ చేసినట్లున్నాను. నేను ఆఫీస్‌కు రావడం లేదు... ఈ లీవ్‌లెటర్ ఆఫీస్‌కు సార్‌తో పంపిద్దామని."

" కాఫీ తాగిపోండి" సావిత్రి అడిగింది.

" లేదు పని ఉంది" - అరుంధతి వెళ్ళిపోయింది.

సావిత్రికి బాధ వేసింది - ఆమె రాకూడని టైమ్‌లో వచ్చిందని.

కొన్ని రోజుల్లో ఆఫీస్‌లో నందకిషోర్ ఇంటి విషయాలు అందరి నోట్లో నానాయి.

ఎవరికి వాళ్ళు చాటుగా ఎగతాళిగా మాట్లాడుకోవడం.... నవ్వుకోవడం చేస్తున్నారు.

మరీ చనువు ఉన్నవాళ్ళు అతనికి సలహాలివ్వడం మొదలెట్టారు కూడా.

" నందూ ! ఇల్లు కాస్త పట్టించుకోమ్మా !"

" ఆఫీసయితే .... మీ పని ఎవరో ఒకరు చేస్తారు. ఇంటికొచ్చి ఎవరు చేస్తారు?"

" మీ ఆవిడకు కాస్త రెస్ట్ ఇవ్వు తండ్రీ!"

" ఆడవాళ్ళను ఊళ్ళెంబడి తిప్పుతారా!"

ఈ గుసగుసలు ఇక ఇకలు వినలేక పోయాడు.

వెంటనే ట్రాన్సఫర్‌కు అప్లై చేశాడు.... తనవాళ్ళు అంటే తన బంధువులు ఉన్న రాయలసీమకు అప్లై చేశాడు. మేనేజర్‌ని రెకమెండ్ చేయమన్నాడు.

" సార్ ! నాకు ట్రాన్స్‌ఫర్ ఇప్పించండి సార్!" కిషోర్ అడిగాడు.

“ ఎందుకోయ్ ! ఇక్కడ బాగానే ఉందిగా ...” మేనేజర్ అన్నాడు.

“ ఇక్కడ పని చేయలేకపోతున్నాను సార్! మీ అంత ఎఫిషియంట్ మేనేజర్ కింద పనిచేయలేకపోతున్నాను సార్” బాధగా అన్నాడు.

మేనేజర్ సంతోషపడ్డాడు. కాని పైకి కనబడనీయలేదు.

“ రెకమెండ్ చేయడానికి నాకు అభ్యంతరం లేదు. కాని, నీది ఇంటర్ డివిజనల్ ట్రాన్స్‌ఫర్... అంటే మన హెడ్ ఆఫీసు నుండి రీజనల్ ఆఫీసుకు పోయి అక్కడ పని కావాలి. అందులో ఇప్పుడు ట్రాన్స్‌ఫర్‌లు బ్యాన్ అంటున్నారు... ఎనీహౌ, నీ లక్ ! నీ అదృష్టానికి నేనెందుకు అడ్డుపడాలి” అతని అప్లికేషన్ పైన రెకమెండేషన్‌లు వ్రాశాడు.

సావిత్రికి ఆ విషయం చెబితే ఎగిరి గంతేసింది – తన వాళ్ళ దగ్గరకు పోతున్నందుకు.

“ మంచిది.... మా వాళ్ళు నాకు చేదోడు వాదోడుగా ఉంటారు” అంది.

పట్టువదలని విక్రమార్కుడిలాగా కిషోర్ ... ఓ నెల తరువాత హెడ్ ఆఫీసుకు పోయాడు.... తన ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ కదిలించడానికి.

హెడ్ ఆఫీసు మేనేజర్ చండశాసనుడు. ఆయనపేరు వరాహం. వరాహ నరసింహమూర్తి అయితే అతని కందరూ ‘వరాహం’ అన్న పేరు ఖరారు చేశారు. పేరుకు తగ్గట్లు ఆకారం కూడా ఉంది.

క్రింద ఆఫీసరులు ఎవరూ ధైర్యం చేయలేదు అతని తరపున చెప్పడానికి.... అందుకని డైరెక్ట్‌గా పోయి కలిశాడు కిషోర్.

ఓ ఐదు నిముషాలు మౌనంగా ఉన్నాడు. తన కాగితాలు తాను చూసుకుంటూ కూర్చున్నాడు వరాహం. ఎదుట ఓ శాల్తి కూర్చుందన్న సంగతి మరచిపోయి కాగితాలు చూసుకుంటూ ఉండిపోయాడు.

కిషోర్‌కు దడ పుట్టింది. కాస్త దగ్గాడు.

వరాహం తలెత్తి కళ్ళద్దాల్లోంచి చూసింది.

" ఎవరు నువ్వు ? ఎందుకొచ్చావు?"

నందకిషోర్ తన గురించి వివరాలు చెప్పాడు.

" నేను అనంతపురంకు ట్రాన్స్‌ఫర్ అప్లై చేశాను సార్.... మీ దయ ఉండాలి".

" ఊ ... ! అయితే గిద్దలూరుకు పోయి ఎన్నిరోజులయింది?"

" రోజులు కాదు సార్.... సంవత్సరాలు ..." నసిగాడు.

" అదే .... ఎన్ని? " గద్దించాడు.

" రెండుసార్ !"

" రెండేళ్ళకొకసారి నీకు ట్రాన్స్‌ఫర్ కావాలన్నమాట ! ట్రాన్స్‌ఫర్ కావాలనుకున్నవాడివి ప్రమోషన్ మీద ఎందుకొచ్చావు?" దబాయించాడు.

" ఇప్పుడు పరిస్థితులు బాగాలేవు సార్ ! నీళ్ళు పడక ఆరోగ్యం దెబ్బతింది. మా ఆవిడకు కూడా అస్సలు బాగాలేదు. మా పిల్లలకు బాగాలేదు" - ధైర్యం చేసి చెప్పాడు.

" అంటే గిద్దలూరులో ఎవ్వరూ బ్రతకడం లేదంటావు?" అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు వరాహం.

కిషోర్‌కు పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది.

" అలా అని కాదు సార్... మాకు పడటం లేదు"

" మరి మిగతా స్టాఫ్ ఎలా బ్రతుకుతున్నారో.... వాళ్ళు కూడా ట్రాన్స్‌ఫర్‌కి అప్లై చేయాలి గదా!"

" వాళ్ళు చాలామంది లోకల్ సార్... అక్కడే పుట్టి పెరిగారు".

" అదీ సంగతి - ఎప్పుడూ లోకల్‌గా ఉండాలి.... ఇంకో ఊరికి పోకూడదు మిస్టర్ కిషోర్... నీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఒకసారి చూసుకో.... నిన్ను ఆల్ ఇండియాలో ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చెయ్యొచ్చు. " అంటూ డిసిప్లిన్ మీద... ట్రాన్స్‌ఫర్‌ల

మీద వరాహం క్లాస్ తీసుకున్నాడు.... కుర్చీలో అటూ ఇటూ ఊగిపోయాడు.... ఆ కుర్చీ అతని బరువు మోయలేక కుర్రో .... మొర్రో అంది.

" ఇంతకీ వాడు ఎలా రెకమెండ్ చేశాడు నిన్ను. యూజ్‌లెస్ ఫెలో.... ఒక్క రూలు తెలీదు వాడికి. మోస్ట్ అన్‌ఫిట్ ఫెలో!" – తర్వాత కిషోర్ మేనేజర్‌ని చడామడా తిట్టాడు.

కిషోర్‌కు కొంత ఆనందంగా ఉంది. కొంత భయంగా ఉంది.

" ఇటువంటి వెధవలంతా మేనేజర్‌లైతే ఇండియా ఏం బాగుపడుతుంది.... ఓకే... నువ్వు వచ్చి ఏడుస్తున్నావు కనుక నేనైతే రికమెండ్ చేస్తున్నా... ఆ రీజనల్ ఆఫీసు వాళ్ళు ఏమంటారో..."

బ్రతుకు జీవుడా అనుకుంటూ బయట కొచ్చాడు.

ఆ గుండె దడ ఓ గంట దాకా తగ్గలేదు.

అంత మోస్ట్ ఎఫిషియంట్ మేనేజర్‌ను ఎంత తేలిగ్గా తీసిపారేశాడు పెద్ద బాస్ అని ఆశ్చర్యపడ్డాడు.

కిందవాళ్ళతో పోయి కాగితాలు కాస్త తొందరగా పంపించమని ప్రాధేయపడ్డాడు. అక్కడ క్లర్క్ చిదానందం నవ్వాడు.

" మీ తొందరేగాని, రీజనల్ ఆఫీసువాళ్లు ట్రాన్స్‌ఫర్‌లకు ఒప్పుకోవడం లేదు... పంపించమంటే పంపిస్తాం!"

" స్వామీ .... మీరు పంపండి. నా తిప్పలేవో నేను పడతాను...."

మొరపెట్టుకొని వచ్చేశాడు.

" మీ ట్రాన్స్‌ఫర్ ఎంతదాకా వచ్చింది?" అరుంధతి నవ్వుతూ అడిగింది.

" రీజనల్ ఆఫీసుకు పోయింది" చెప్పాడు ముక్తసరిగా.

" నీ వల్ల కాదు కాని.... మీ ఆవిడని పంపండి.... పని సాధించుకొస్తుంది".

అరుంధతి సలహా.

చర్రున కోపం వచ్చింది. అది ఎవడన్నా మొగవాడు అని ఉన్నట్లయితే ఊరుకొనే వాడు కాదు..... అన్నది ఆడకూతురు.

" ఎలా సాధించుకోవాలో నాకు తెలుసు, మీ సలహా అక్కర్లేదు."

" ఎందుకంత కోపం! మనకంత పరపతి ఉంటే అస్సలు ఈ ఊరికే ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేస్తారు కనుక" అరుంధతి.

" మరి మీకెలా వచ్చింది ట్రాన్స్‌ఫర్ ఈ ఊరికి?"

" నాది టెంపరరీ ! రూరల్‌లో పనిచేయాలన్న రూలు ఉందిగా.... అందుకని వచ్చాను.... లేకపోతే సిటీలో ఉండి పోయేదాన్ని" చెప్పింది

అరుంధతి అందంగానే ఉంటుంది కాని.... మాటలు మటుకు అందంగా ఉండవు.

" మీ ఆవిడ బాగుందా?"

" ఆవిడకేమయింది - బాగానే ఉంది"

" అది కాదు గురూ ...! ఆవిడను కొంచెం గ్రిప్‌లో పెట్టుకో.... ఆడవాళ్ళు మొగుడి మీద పెత్తనం చేస్తే చూసేవాళ్ళకు బాగుండదు. కాస్తా కంట్రోల్‌లో పెట్టుకో....!" అరుంధతి సలహాలిచ్చింది.

" మా సంసారంలో ఇతరుల జోక్యం నేను సహించను."

" నీ ఖర్మ ! ఏదో నీ మంచి కోసమే చెప్పింది" - అరుంధతి మూతి ముడుచుకుని వెళ్ళిపోయింది.

జుత్తు పీక్కోవాలనిపించింది. ఈ మనుష్యులకు ఇవేం బుద్ధులు. ఒక పట్టాన బ్రతకనివ్వరు.

కొన్నాళ్ళ తర్వాత ఒక శుభముహూర్తం చూసుకొని - భాగ్యనగరం నడిబొడ్డులో వున్న రీజనల్ ఆఫీసుకు వేంచేశాడు కిషోర్.

పర్సనల్ సెక్షన్‌లో పోయి కలిశాడు నిరంజన్‌ను.

" సారీ ! ట్రాన్స్‌ఫర్‌లు ఏవీ పుటప్ చేయొద్దని బాస్ ఆర్డర్. అందుకే నీది

పెండింగ్ పెట్టాను."

" అయ్యో ! నాది అర్జెంట్.... మళ్ళీ ఈ సీజన్ దాటితే ఒక్క సంవత్సరం ఆగాల్సి వస్తుంది".

" నిజమే ! బాస్ ఇష్టపడడం లేదు ట్రాన్స్‌ఫర్ అంటే. ప్రతి ఒక్కడు మూడేళ్ళన్నా పని చేయాలని ఆయన అభిప్రాయం."

" పోనీ నే పోయి కల్సి నా సమస్యలు చెప్పుకుంటాను" చెప్పాడు.

భగవంతుడికి భక్తుడికి అనుసంధానం లాగా .... ఆర్.యమ్ గారి ఛాంబర్ ముందు స్టెనో గది ఉంది. ముందుగా ఆమె అనుమతి పొందందే లోపలికి పోకూడదు కాబట్టి .... శివుడ్ని దర్శించేముందు నందిని సందర్శించినట్లు స్టెనోను కలిశాడు.

ఓ అపరంజి బొమ్మ అలవోకగా కూర్చొనుంది. ఆమె పేరు అనసూయ. అనసూయ అందం నిజంగా అసూయపడే అందం. పనిలేనట్టుంది - ఓ పాత మ్యాగజైను చదువుకుంటోంది.

కిషోర్ చేతిలోని తెలుగు జ్యోతి - ఉగాది ప్రత్యేక సంచికను టేబుల్‌మీద పెట్టి చేతులు నలుపుకున్నాడు.

అనసూయ కళ్ళెత్తి చూసింది అతన్ని .... ఆ తరువాత ఉగాది ప్రత్యేక సంచికను.

" ఏం కావాలి ?" వరాలిచ్చే దేవతలా అడిగింది.

' నీ మొహం ... నువ్వు నాకేమిస్తావు... నాకు కావలసింది ఆర్.యమ్. ఇవ్వాలి' అని మనసులో అనుకొని పైకి మట్టుకు నవ్వాడు.

" హి హి ! ఆర్.ఎమ్. గారిని కలవాలి!"

" ఎందుకు ?" ఆమె అడిగింది.

కిషోర్‌కు ఒళ్ళు మండింది. అయినా అది రీజనల్ ఆఫీస్. తనకు ఎవరూ తెలీదు కనుక వినయంగా చెప్పాడు.

" గిద్దలూరు నుండి వచ్చాను..... అనంతపురంకు ట్రాన్స్‌ఫర్ కావాలి".

" ఓ ! గిద్దలూరా ! అరుంధతి బాగుందా ?" అడిగింది అనసూయ.

" ఓ అరుంధతి మీకు తెల్సా.... తనకేం, చాలా బాగుంది " చెప్పాడు ఆనందంగా ఓ లింకు దొరికినందుకు సంతోషపడుతూ.

" అవునా.... మీకు ఈ ప్రత్యేక సంచిక ఎలా దొరికింది? ఇక్కడ దొరకడం లేదు" కుతూహలంగా అడిగింది.

" మీకు కావాలా! ఉంచుకోండి" చెప్పాడు వెంటనే.

" మరి మీకు !"

" ఇంకోటి కొంటాను ".

" అయిపోవా ?"

" అబ్బే ! ఆ ఊళ్ళో మేగజైన్ కొనేవాడు ఎవడు?"

" అయితే డబ్బులిస్తాను".

" ఆ పని మటుకు చెయ్యమాకండి - అలాగైతే అసలివ్వను. దీంట్లో ఏముందండి! ఇదేమన్నా లంచమా!" కుర్చీలో కూర్చొంటూ చెప్పాడు.

" థ్యాంక్స్ ! అరుంధతిని అడిగానని చెప్పండి. ఆయన గారు బిజీగా ఉన్నారు. ఓ గంట పడుతుంది. మీ కార్డు ఇవ్వండి. డిటెయిల్స్ రాసి పంపిస్తాను" చెప్పింది.

విజిటింగ్ కార్టు మీద తన వివరాలు - ఎందుకొచ్చింది రాసి యిచ్చాడు - అది ప్యూన్ చేతికిచ్చింది అనసూయ - లోపల ఇమ్మని.

ఏసీ రూములో కూర్చున్నా గాబరాతో చెమటలు పడుతున్నాయి.

ప్రత్యేక సంచిక తిరగేస్తున్న అనసూయ ఓ కంట అతన్ని గమనిస్తూనే ఉంది..... అతని అవస్థకు నవ్వుకుంటున్నది.

" అరుంధతి తిరుగుతూనే ఉందా!" అడిగింది.

" అంటే .... నడుస్తూనే ఉంది...." అర్థం గాక చెప్పాడు.

" అలా కాదు..." నాన్చింది.

" లవ్లీ గర్ల్ ! బాగా కలుపుకోలుగా ఉంటుంది. అందరితో కల్సిమెల్సి ఉంటుంది" ఆమె ఫ్రెండును మెచ్చుకుంటే తనకేమన్నా ఉపయోగముంటుందేమోనని చెప్పాడు.

అనసూయ నవ్వింది వంకరగా !

" ఆ ! ఇక్కడా బాగా కలుపుగోలుగా ఉండేది.... మొగాళ్ళతో, కాస్త అడ్డగోలుగా కూడా ఉండేది. చెప్పింది.

" ఏం చేసేది?" ఏదో ఉందని అనిపించి అడిగాడు.

అతను అడగడం ఆలస్యం. ఆమె అరుంధతి గురించి ఏకరువు పెట్టింది. అతని తల తిరిగిపోయింది. ఆమె చెప్పిందాన్ని బట్టి అరుంధతి 'బిచ్' కంటే అధ్వాన్నం. ఎవడు పడితే వాడితో తిరిగేది. ఎవడి పక్కలో పడితే వాడి పక్కలో పడుకునేది. పెళ్లి కాకముందే రెండుసార్లు కడుపు తెచ్చుకొని అబార్షన్స్ చేయించుకుంది.

" నేను నమ్మలేక పోతున్నాను.... చాలా పతివ్రతలాగా కబుర్లు చెబుతుందే!" ఆశ్చర్యపోయి అడిగాడు.

" అదే ఆమె స్టయిలు !" చెప్పింది.

అరుంధతి పురాణం విన్న తరువాత అనసూయ అతనికి బాగా దగ్గరయి నట్లనిపించింది.

" ప్లీజ్ ! నేను చాలా కష్టాల్లో ఉన్నాను..... ఆర్.యమ్.తో చెప్పి ట్రాన్స్‌ఫర్‌ను యిప్పించండి" ప్రాధేయపడ్డాడు.

" వచ్చారుగా - పోయి అడగండి" - సలహా యిచ్చింది.

" కాని చాలా టఫ్ అని విన్నాను. ఎవరి మాట వినడట కదా కిందవాళ్లు చెప్పిందాన్ని పట్టి గ్యారంటీగా నో అంటారు. ఏమన్న మార్గం ఉంటే చెప్పండి". ఆమె కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు.

" బాస్‌కు ఓ వీక్‌నెస్ ఉంది.... ఎవరి మీదయినా చాడీలు చెబితే బాగా

వింటాడు" చెప్పింది అనసూయ.

మిగతా వివరాలు అడిగేలోపుగా ప్యూన్ వచ్చి ఆర్.యమ్ పిలుస్తున్నాడని చెప్పి లోపలికి పంపించాడు కిషోర్‌ను.

వణుకుతున్న కాళ్ళతో లోపలికి వెళ్ళి రెండు చేతులెత్తి నమస్కారం పెట్టి నిల్చున్నాడు.

" కూర్చోవోయ్ !" అరిచాడు.

" ఫర్వాలేదు సార్ - పెద్దల ముందు నిల్చునే ఉండాలని మా నాయనమ్మ చెప్పింది" భయపడ్తూ చెప్పి నిల్చున్నాడు కుర్చీ పట్టుకుని.

" ఊ ! మీ నాయనమ్మ బుద్ధిమంతురాలు లాగుందే - ఇంతకీ ఏం పనిమీద వచ్చావు?" అడిగాడు అతని ఫైలు తిరగేస్తూ ....

" సార్ తమరనుగ్రహిస్తే - అనంతపురంకు ట్రాన్స్‌ఫర్ మీద పోదామని ... సార్ - గిద్దలూరు నీళ్ళు బాగాలేవు సార్ - పోయినప్పటినుండి నాకు మోషన్సు - వాంతులు - మా ఆవిడకు జ్వరం - పిల్లలకు ఏవో కంప్లైంట్స్ - " అంటూ తన శారీరకబాధలు చెప్పాడు.

ఆర్.యమ్. ఇంకా చెప్పు అన్నట్లు వింటూనే ఉన్నాడు తల వంచి. సౌండు ఆగిపోయింతర్వాత అడిగాడు క్యాజువల్‌గా....

" మీ ఆఫీసు ఎలా వుంది?"

అనసూయ గుర్తుకు వచ్చింది.

" బాగాలేదు సార్..." చిన్నగా చెప్పాడు.

" ఆ ! బాగాలేదూ - వ్వాట్ ... మీ మేనేజరు ఎలా వున్నాడు యూజ్‌లెస్‌ఫెలో!" చివ్వున తలెత్తి అడిగాడు.

" లాభం లేదు సార్ - మోస్టు ఇనెఫిసియంట్ - ఓ అంటే నా రాదు..... కళ్ళు మూసుకుని సంతకాలు పెడతాడు. కింద వాళ్ళు ఏం తప్పు రాసినా కనుక్కోలేదు... ఉత్తి తెల్లకాగితం తెచ్చినా సంతకం పెడతాడు" చెప్పాడు మేనేజరు మీద.

" ఊ ! రెజిగ్నేషన్ లెటరు రాసి పెట్టినా సంతకం పెడతాడా? నాకు తెల్సు వాడు అన్‌ఫిట్ అని. మోస్ట్ యూజ్‌లెస్ ఫెలో.... కాళ్ళా వేళ్ళా పడితే వాడికి ట్రాన్స్‌ఫర్ ఇవ్వకుండా ఉంచాను.... అయినా వాడి కింకా బుద్ధి రాలేదన్నమాట" ఆశ్చర్యపోతూ అన్నాడు.

" సార్ ! అర్హులు కాని వారిని అందలం ఎక్కిస్తే ఏమవుతుంది సార్."

" సరే ! మీ వరాహం ఏమంటున్నాడు.... బాగున్నాడా !"

" బాగున్నాడు సార్... బాగా కష్టపడి పనిచేస్తాడు . ఆయన వచ్చిన తర్వాత మా డివిజన్ బాగా ఇంప్రూవ్ అయింది సార్!"

" వాడి మొహం ! వాడు చేసేదేముంది. మీరంతా కష్టపడి పనిచేస్తే కదా ! ఇంప్రూవ్ అయ్యేది... వాడు వేస్ట్ క్యాండిడేట్ !"

అసంతృప్తి వ్యక్తపరచాడు ఆర్.యమ్.

కిషోర్ ఈసారి నిజంగా స్టన్ అయిపోయాడు. ఇన్నాళ్ళు తన మేనేజర్ గురించి సూపర్‌బాస్ వరాహం గురించి చాలా గొప్ప పేరు ఉందని విన్నాడు. అటువంటిది ఆర్.యమ్. ఇద్దర్నీ పురుగులు తీసేసినట్లు తీసేస్తున్నాడు.

" సార్.... నా ట్రాన్స్‌ఫర్...."

" వరాహం ఏమంటాడు నీ ట్రాన్స్‌ఫర్ గురించి ?"

" ఇవ్వనన్నాడు సార్.... నేనే కాళ్ళా వేళ్ళా పడి రికమెండ్ చేయించి పైకి పంపించుకున్నా !"

" వాడెవడు ట్రాన్స్‌ఫర్ ఇవ్వడానికి ..... ఇవ్వకపోవడానికి... ఆ మాట నేను చెప్పాలి ! యూజ్‌లెస్ ఫెలో! ట్రాన్స్‌ఫర్ ఇవ్వద్దని అడ్డంగా వ్రాసి కాగితం నాకు పంపాడు".

ఆర్.యమ్. కళ్లెత్తి చూశాడు.

" నిజమా సార్ ! నేను చాలా చెప్పుకున్నా.... ఆర్.యమ్. గారికి నా

కష్టాలు చెప్పుకొంటూ.... రెకమెండ్ చెయ్యమని" కంగారు పడుతూ అన్నాడు.

" వాడు అస్సలు అప్ అండ్ డౌన్ కాండిడేట్. మాటి మాటికి పుట్టింటికి పోతూ ఉంటాడు. వాడు ఇంకొకడికి అడ్డు పడడం కూడా "

" నిజమే సార్.... మీకు చెప్పకుండా కూడా ఊరికి పోతూ ఉంటాడు" - అనసూయ గుర్తుకొచ్చి సన్నాయి నొక్కులు నొక్కాడు, తను విన్నవి.

" అవును.... నాకు తెలుసు ...... పిల్లి కళ్ళు మూసుకొని పాలు త్రాగుతూ తన్ను ఎవరూ చూడడం లేదనుకుంటుంది..... నా కన్నీ తెలుసు. ఎవరు ఏం చేస్తున్నది నాకు తెల్సు. పర్మిషన్ లేకుండా ..... హెడ్ క్వార్టర్స్ వదలి వాళ్ళ ఊరికి పోవడం నాకు తెలుసు. బార్డర్‌కు మాటి మాటికి క్యాంపులు వేసుకొని పోతాడు, అదీ సెలవుల్లో! అక్కణ్ణుంచే వాళ్ళ ఊరికి వెళ్ళిపోతాడు. నేను ఎన్నో సార్లు వార్నింగ్ ఇచ్చాను పోవద్దని. అయినా వరాహం గాడికి బుద్ధి రాలేదు" ఆర్.యమ్. మండిపడ్డాడు.

" అవును సార్ ! దేవుడు లాంటి మిమ్మల్ని మోసం చేసిపోవడం తప్పుసార్! కావాలంటే సెలవు పెట్టుకొని వెళ్ళచ్చుకదు సార్ ...."

" ఎన్నిసార్లని సెలవు పెడతాడు.... మొహం చెల్లద్దు.... అందుకే అలా దొంగచాటుగా పోతున్నాడు. రానీ .... చెప్తా..... ఈసారి ఇంకా దూరంలో పారేస్తా.... వాళ్ళ ఊరికి పోవాలంటే రెండు రోజులు ప్రయాణం చేసేటట్టు...."

" సార్.... అతనికి మా మేనేజర్ భలే వత్తాసు పలుకుతాడు సార్. ఆయన పంది అంటే పంది.... నంది అంటే నంది" అంటించాడు.

" ఓ! వీళ్ళిద్దరూ తోడు దొంగల్లా ఉన్నారు.... ఇద్దరికీ ఈ ఏడు మూడింది... చెరో ప్రక్క పారేస్తా.... ఎలా కల్సుకుంటారు? ఎలా దొంగ నాటకాలడతారో చూస్తా!" ఆర్.యమ్. సంతోషపడిపోతూ చెప్పాడు, కిషోర్‌ను ఆప్యాయంగా చూస్తూ.

" సార్ నాకు ట్రాన్స్‌ఫర్ రావడం వాళ్ళిద్దరికీ ఇష్టం లేదు సార్. మా మేనేజరు ముందే ఫోన్ చేసి చెప్పి ఉంటాడు ఇవ్వొద్దని. నేను పోతే నాలాగా గొడ్డు చాకిరి చేసే ఇంకో గొడ్డు దొరకదు సార్... అందుకే వద్దని ఉంటాడు" జీరగొంతుతో

చెప్పాడు.

" వాడెవడయ్యా నీ కడ్డుపడడానికి.... వాడెంత .... వాడి బ్రతుకెంత.... నేను తల్చుకుంటే వాడ్నే అండమాన్‌కు పంపిస్తాను." కోపంగా అరిచాడు ఆర్.యమ్.

" వరాహం కూడా సార్... పిల్లా పాపలు అని కూడా చూడు. భలే స్ట్రిక్ట్ ! ఒట్టి కసాయివాడు" చెప్పాడు కిషోర్. వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట దెబ్బ తగలాలి కదా ఇనుముకు, అని చదువుకున్నవాడు మరి.

" చూడు మిస్టర్ కిషోర్ ! నేను చెబుతున్నా గదా.... ఎవరు అడ్డుపడ్డా నీకు ట్రాన్స్‌ఫర్ ఇచ్చేది నేను.... వెంటనే నీకు ఆర్డర్లు వేస్తాను... వాళ్ళ గురించి భయపడవద్దు" అభయమిచ్చాడు శ్రీకృష్ణపరమాత్మలాగా.

" థ్యాంక్యూ సార్.... అనంతపురంకు వేయించండి సార్!" ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బైపోతూ చెప్పాడు.

" నో నో ... నో అనంతపూర్... అక్కడేముందయ్యా .... వెంటనే హైదరాబాద్‌లో జాయిన్‌గా..... రీజినల్ ఆఫీసులో వేస్తాను" - ఆర్.యమ్. స్టెనో కోసం ఇంటర్‌కమ్ చేశాడు.

కిషోర్ గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. ఆఫీస్ పరంగా రీజనల్ ఆఫీస్ మంచిదే! అధికారం ఉంటుంది. పలుకుబడి ఉంటుంది పని కూడా ఉండదు కాని ఖర్చు ! భాగ్యనగరంలో భాగ్యం లేనివాడు అభాగ్యుడే! వచ్చే జీతం సరిగా సరిపోదు. మళ్ళీ హైదరాబాద్‌లో సిటీ బస్‌లకు ..... అద్దెలకు.... రాజధాని అనంగానే వచ్చే బంధువులను పోషించడానికి అయ్యే ఖర్చులకు పిల్లల చదువులకు తడిసి మోపెడవుతుంది... అమ్మో భయమేసింది.

అనసూయ కులుక్కుంటూ లోపలి కొచ్చింది. చేతిలో పెన్ను.... నోట్ బుక్‌తో....

" చూడు అనూ.... ఇతనికి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు ఇవ్వాలి"

" సార్.... హైద్రాబాద్ వద్దు సార్. అనంతపురంకు సార్...." ప్రాధేయపడ్డాడు.

" వాటె మ్యాన్... హైదరాబాదు బాగుందయ్యా.... నువ్వు బాగా నచ్చావు".

" సార్... ఎవరికీ హైదరాబాదు రెకమెండ్ చెయ్యరు.... అటువంటిది మీకు చేస్తున్నారంటే ... అది మీ అదృష్టం!" చెప్పింది అనసూయ.

" నిజమే సార్... అక్కడ మా బంధువుల పరిస్థితి బాగోలేదు సార్. మా వాళ్ళని .... మా ఆవిడ వాళ్ళని నేనే చూసుకోవాలి. కావాలంటే ఓ రెండేళ్ళ తర్వాత వస్తాను సార్..." వినయంగా చెప్పాడు.

" నీ కర్మ .... ఓకే... యు కెన్‌గో...." ఆర్. యమ్. చెప్పాడు.

ఆర్డర్ చేతిలో పట్టుకొచ్చిన భర్తను చూసి ఎగిరి గంతేసింది సావిత్రి. అతన్ని ముద్దు పెట్టుకుంది. ఆర్డర్లను దేవుడి దగ్గర పెట్టింది. అందరికీ చెప్పొచ్చింది.

" ఏమో అనుకున్నా .... మీరు ఘటికులే !" పొగిడింది.

విజయగర్వంతో ఆఫీస్‌కు వెళ్ళాడు నందకిషోర్. మేనేజర్ మొహాన విసురుగా కవరు పడేశాడు.

" నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది... అనంతపురంకు" చెప్పాడు.

" అరే నీ కెవడయ్యా ట్రాన్స్‌ఫర్ ఇచ్చింది? వట్టి పనికిమాలిన వాడు ఇచ్చి ఉండాలి" మేనేజర్ ఏడుస్తూ అన్నాడు.

" సాక్షాత్తు ఆర్.యమ్. ఇచ్చాడు సార్!"

" హూ ! వాడికి అడ్మినిస్ట్రేషన్ ఏమి తెలుసుకనుక? కాళ్ళా వేళ్ళా పడితే ఇచ్చేసి ఉంటాడు. అందుకే ఇండియా ఇలా ఉంది" బాధపడుతూ చెప్పాడు మేనేజర్.

అరుంధతి దగ్గరకు పోయి తన ఆర్డర్లు చూపించాడు.

" అన్నట్లు ... అనసూయ మిమ్మల్ని అడిగానని మరీ మరీ చెప్పమంది. మీరు బెస్ట్ ఫ్రెండ్స్‌ట కదా!" చెప్పాడు ఆమెను చూస్తూ.

" దాంతో నాకు ఫ్రెండ్‌షిప్పా ! పాడా ! కాస్త కలిసి పనిచేశామంతే!"

" అరే ! మీరంటే ఎంతో ఇదిగా చెప్పిందే !" ఆశ్చర్యంగా అన్నాడు.

" హూ ! కులుకుతూ చెప్పి ఉంటుంది. దాని బ్రతుకంతే ! మొగాళ్ళని ఎలా బుట్టలో పెట్టాలా అని ఆలోచిస్తూ ఉంటుంది. రీజనల్ ఆఫీస్‌లో అందర్నీ వలలో వేసుకుంది. ముఖ్యంగా బాస్‌లకు స్పెషల్ సర్వీసు చేస్తుంది. రాత్రిళ్ళు కూడా " వంకరగా చెప్పింది అరుంధతి మూతి మూడు వంకర్లు తిప్పుతూ.

" అరె ! నాకలా అనిపించలేదు. అతి పవిత్రంగా విభూతి, బొట్టు పెట్టుకొని... ఎంతో అందంగా ..." ఆలోచనగా అన్నాడు.

" కాకపోతే గుడ్డలు విప్పుకు తిరుగుతుందా.... అలా నంగనాచి వేషాలు వేయబట్టే మీలాంటోళ్ళు దాని వలలో పడుతున్నారు. ఇప్పటికది ఇద్దరు మొగుళ్ళను మార్చింది. అయినా దానికి మొగుడుతో పనేంటి.... ఏ మొగాడు కాదంటాడు కనుక దాన్ని!" అరుంధతి అసూయతో చెప్పింది అనసూయ గురించి.

కిషోర్ తల తిరిగి పోయింది.

ఈ లోకంలో ఎవరికీ ఎవరి మీదా సదభిప్రాయం ఉండదు లాగుంది. పైకి నవ్వుతూ పలకరించినా..... స్నేహం నటిస్తున్నా అవతలి మనిషి మీద మటుకు మంచి అభిప్రాయం ఉండదు లాగుంది. ప్రతి మనిషికీ కేవలం ఎదుటివాడి బలహీనతలు మాత్రమే కనిపిస్తాయి లాగుంది. అవతలి వాడి గొప్పతనం ఒప్పుకోవడానికి మన మనస్సు ఒప్పుకోదు. ఎందుకంటే మనల్ని మనం ప్రేమించుకున్నట్లు ఇతరులను ప్రేమించలేము కనుక.

కాబట్టి మన గురించి ఇతరుల అభిప్రాయాలు విని బాధపడేముందు వారి గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో వాకబు చేస్తే మంచిదనిపించింది కిషోర్‌కు.

( రచన మాసపత్రిక కథాపురస్కారం పొందిన కథ)